సాక్షి మెదక్

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



రెచ్చిపోతున్న దొంగలు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్తే చాలు ఇల్లు గుల్ల చేస్తున్నారు.

వివరాలు 10లో ▸



కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

కరాటే నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వానికి కరాటే ఉపయోగపడనుంది.

వివరాలు 10లో ▸



విద్యార్థులకు కంప్యూటర్ విద్య

దాతల సహకారంతో సర్కారు పాఠశాలల విద్యార్థులకు పలు కోర్సుల్లో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

బీబీపాటిల్‌ను ఆశీర్వదించండి



కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న బీబీపాటిల్

టేక్మాల్(మెదక్): దేశాభివృద్ధికి మోదీ, జహీరాబాద్ అభివృద్ధి కోసం బీబీపాటిల్ అహర్నిశలు కృషి చేస్తున్నారని శ్రీశైలం మఠాధిపతి జగద్గురు శివాచార్య మహాస్వాములు తెలిపారు. శుక్రవారం మండలంలోని పల్వంచ శివారులో బీబీ పాటిల్ ఆధ్వర్యంలో కేతకి సంగమేశ్వర స్వామి సహస్ర కుంభాభిషేకం, మహామంగళ హారతి, జగద్గురు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మఠాధిపతి జగద్గురు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశాన్ని ఒక్కటి చేయడానికి, ధర్మాన్ని కాపాడడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీబీ పాటిల్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అభిషేక్ పాటిల్, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మల్లిక, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైసుమిల్లు వ్యాపారి అరెస్ట్

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన రైసుమిల్లు వ్యాపారి నోముల పాండురంగంను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. ఆయనకు మండలంలోని పెద్దచింతకుంట పరిధిలో రైసుమిల్లులు ఉన్నాయని.. 2021 నుంచి ప్రభుత్వం నుంచి వడ్లు తీసుకొని సీఎంఆర్ కింద బియ్యం అందజేయలేదన్నారు. పాండురంగం ప్రభుత్వానికి రూ.44 కోట్ల 56 లక్షల బకాయి ఉన్నాడని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా డబ్బులు చెల్లించనందున కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పురుషులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణా కేంద్రం డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగినవారు అర్హులని చెప్పారు. పూర్తి సర్టిఫికెట్లతో సంగారెడ్డి స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో హాజరు కావాలన్నారు. ఈనెల 18 నుంచి నెల రోజుల పాటు శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లా వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించలన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న శంకర్

మెదక్‌జోన్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమ సదస్సును శుక్రవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే ప్రకటిస్తున్న కేంద్ర మంత్రుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. వెంటనే మెదక్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు రామస్వామి, బాల్‌రాజు, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల హోరు.. నేతల పోరు

ప్రధాన పార్టీల మధ్య పరస్పరం ఫిర్యాదులు

- అభ్యర్థులపై ఆరోపణలు, ప్రత్యారోపణలు
- రోజురోజుకూ వేడెక్కుతున్న రాజకీయం
- మెదక్ సెగ్మెంట్‌లో రసవత్తరం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మెదక్ లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ఈ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ప్రధాన పార్టీల నేతలు పరస్పరం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీల అభ్యర్థులపై పలు పోలీస్‌స్టేషన్లలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు అవుతుండటమే కాకుండా.. ఇటు రాజకీయ వివాదాలకు దారితీస్తున్నాయి. మాజీ మంత్రి హరీశ్ రావుపై బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హరీశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రఘునందన్‌రావుపై సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వారం రోజుల క్రితం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసు నమోదైంది. అలాగే ఇటీవల సిద్దిపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సెర్ప్, ఐకేపీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించడం కూడా రాష్ట్ర స్థాయిలో వివాదానికి దారితీసింది. ఉద్యోగుల సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఈ రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొన్నందుకు గాను మొత్తం 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడటం ఇటు రాజకీయ వర్గాలతో పాటు, అధికార వర్గాల్లోనూ కలకలం రేపింది. ఈ సమావేశం నిర్వహించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో పాటు రవీందర్‌రెడ్డిపై కూడా సిద్దిపేట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వెంకట్రామిరెడ్డిపై రఘునందన్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోనే సంచలనం సృష్టిస్తున్న ఫోన్‌ట్యాపింగ్ కేసులో కూడా వెంకట్రామిరెడ్డి హస్తం ఉందంటూ రఘునందన్‌రావు ఆరోపించడం కలకలం రేపుతోంది.

తాజాగా బీజేపీ క్యాలెండర్లపై..

తాజాగా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వెళ్లింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రఘునందన్‌రావు శ్రీరాముడు, ప్రధాని మోదీ, తన ఫొటోలతో కూడిన క్యాలెండర్లను ఓటర్లకు పంపిణీ చేశారని ఆరోపిస్తూ పటాన్‌చెరు కాంగ్రెస్ నాయకులు ఇటీవల రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు సదాశివపేట్‌లో ప్రభుత్వ ఉద్యోగి ఓ పార్టీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడం కూడా ఆయనపై సస్పెన్షన్ వేటు పడిన విషయం విదితమే. ఇలా ప్రధాన పార్టీల అభ్యర్థుల పరస్పరం ఫిర్యాదులు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు కావడంతో మెదక్‌లో రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు పరస్పరం విమర్శలు, ఆరోపణలతో మాటల యుద్ధం కొనసాగుతోంది.

రాష్ట్రంలో ఏ లోక్‌సభ స్థానంలో లేనివిధంగా మెదక్‌లో మూడు పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. నువ్వానేనా అన్నట్లుగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య పోరు రసవత్తరంగా మారింది. ఈ క్రమంలోనే అభ్యర్థులతో పాటు, ఆయా పార్టీల నాయకులు ఆరోపణలు, ప్రత్యారోపణలు, ఫిర్యాదులు, కేసుల నమోదు.. ఇలా మెదక్ పోరు రాష్ట్రంలోనే సంచలనంగా మారుతోంది.



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన ఎంపీ అభ్యర్థి నీలం మధు

వారికి గుణపాఠం చెప్పండి

- మంత్రి కొండా సురేఖ
- బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపిస్తే బీజేపీకి తాకట్టు పెడతారని ఆరోపణ

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించి కేసీఆర్, హరీశ్‌రావుకు గుణపాఠం చెప్పాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అధ్యక్షతన మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపించుకొని బీజేపీకి తాకట్టు పెట్టి లిక్కర్ కేసు నుంచి కవితను కాపాడేందుకు కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మున్ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కూడా బీజేపీకి అమ్ముకునే అవకాశం ఉందన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కాంగ్రెస్‌లో మంత్రి పదవులు చేపట్టి పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. సోనియా, రాహుల్‌గాంధీకి మెదక్ పార్లమెంట్‌పై ప్రత్యేక అభిమానం ఉందని.. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి వారికి కానుకగా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలంతా ఏకమై నీలం మధును గెలిపించాలని కోరారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు మాట్లాడుతూ.. 9 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించి పెద్ద ఎత్తున దోచుకున్న కేసీఆర్, హరీశ్‌రావును వారి స్వగ్రామాలకే అంకితమయ్యేలా పోరాటం చేస్తానని తెలిపారు. తెలంగాణ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఎంపీ అభ్యర్థి నీలం మధు మాట్లాడుతూ.. ఎంపీగా గెలిపిస్తే ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా మండలాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, నరేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీలు స్వరూప, జ్యోతి, గుర్రాల మల్లేష్, అశోక్, శ్రీనివాస్‌గుప్తా, రిజ్వాన్, మణిదీప్, సురేష్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ మోదీ ప్రధాని కావాలి

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న రఘునందన్‌రావు

రామాయంపేట(మెదక్): ఈదేశం బాగుండాలంటే మళ్లీ మోదీ ప్రధాని కావాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం రామాయంపేటలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. కారు పాలనలో ఇబ్బంది పడ్డామని ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసగిస్తుందని ఆరోపించారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో పన్నులు విపరీతంగా పెంచి ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. రూ. రెండు లక్షలు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓట్లు వేయించుకొని ప్రజలను మోసగిస్తున్నాయని, కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు దయానందరెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు భానుచందర్, నాయకులు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే తలంబ్రాలు

నారాయణఖేడ్: భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటివద్దకు చేర్చే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఖేడ్ పట్టణంతోపాటు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ముమ్మరంగా బుకింగ్‌లు ప్రారంభించారు. ఖేడ్ ఆర్టీసీ డిపో మార్కెటింగ్ సెల్ ఇన్చార్జి పాండు శుక్రవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తోపాటు పలువురికి అవగాహన కల్పించి బుకింగ్ చేయించారు. కేవలం రూ.151 చెల్లిస్తే తలంబ్రాలను ఇంటికి తెచ్చి ఇస్తారని డీఎం మల్లేశయ్య తెలిపారు. వివరాలకు 9441071134, 9959223170, 9989032336 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



బుకింగ్ రశీదును అందజేస్తున్న పాండు

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



తేమశాతం పరిశీలిస్తున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుపల్లి, వాడి, రాజ్‌పేట, కొత్తపల్లి, గాజిరెడ్డిపల్లిలో పర్యటించి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో తాగునీటిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతకు వచ్చినందున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు తూకం వేసే ముందు ధాన్యంలో 17శాతం తేమశాతం ఉండేలా చూడాలన్నారు. నాణ్యత గల ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడినన్ని టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, ప్యాక్స్ సీఈఓ సాయి, సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ గడ్డ.. గులాబీ అడ్డా



వెల్దుర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్)/కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ గడ్డ మీద మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ పాలించిన పదేళ్ల కాలంలో ఎకరం పొలం ఎండిపోలేదని, నేడు సుమారు 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని వాపోయారు. మాయమాటల రఘునందన్‌రావు డిపాజిట్ కోల్పోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు దేవేందర్‌రెడ్డి, మన్సూర్, కృష్ణాగౌడ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌లో కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పార్టీని వీడుతున్నాడని, తాను మాత్రం కేసీఆర్ వెంటే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతి హామీని ఫోన్‌లో రికార్డు చేసుకోవాలని నెరవేర్చకపోతే నిలదీయాలని ప్రజలకు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సార రామా గౌడ్, ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నీటిని నింపి..దప్పిక తీర్చి

- వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ చర్యలు
- మెదక్ రేంజ్ పరిధిలో ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు



సాసర్‌పిట్‌లో ట్యాంకర్‌తో నీటిని నింపుతూ..

హవేళిఘణాపూర్(మెదక్): వేసవిలో వన్యప్రాణుల రక్షణకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి కోసం జంతువులు బయటకు రాకుండా కంచెను ఏర్పాటు చేసి అందులోనే వాటికి అవసరమైన మేతను పెంచుతున్నారు. మెదక్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఐదు సెక్షన్ల పరిధిలో 11 వేల 300 హెక్టార్ల విస్తీర్ణంలో అవసరమైన చోట సాసర్‌పిట్లను ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. అలాగే ఏడు సోలార్ బోర్ల ద్వారా జంతువులకు ఎలాంటి తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో దాహార్తిని తీర్చుకునేందుకు జంతువులు బయటకు వచ్చే అవకాశం ఉన్నందున రేంజ్ పరిధిలోని ఐదు సెక్షన్ల పరిధిలో బీట్ ఆఫీసర్లతో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేశారు. అడవిలోని సాసర్ పిట్లలో నీటిని నింపి తాగునీరందిస్తున్నారు. పోచారం డ్యాం వద్ద జంతువుల కోసం ప్రత్యేకంగా గడ్డిని పెంచి ఆహారంగా అందజేస్తున్నారు. తమ సిబ్బంది రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నారని మెదక్ ఎఫ్ఆర్వో మనోజ్ కుమార్ తెలిపారు. నిత్యం ఐదు బృందాలను ఏర్పాటు చేసి జంతువుల రక్షణ కోసం చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.



పోచారం అభయారణ్యంలో నీరు తాగుతున్న జింకలు



జంతువుల మేత కోసం పెంచిన పచ్చగడ్డి

ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్

- 10 నెలలుగా చెల్లింపులు లేవు
- వైద్యం అందించేందుకు నిరాకరణ
- ఇబ్బంది పడుతున్న రోగులు



మెదక్‌జోన్: ఆరోగ్యశ్రీ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. 10 నెలలుగా బిల్లులు రావడం లేదని ఆస్పత్రుల వైద్యులు చికిత్స చేసేందుకు ససేమీరా అంటున్నారు. దీంతో వైద్యం అందక పేదలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకాన్ని 3 ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా అమలు చేస్తున్నారు. ఇందులో రెండు మెదక్ పట్టణానికి చెందినవి కాగా మరొకటి నర్సాపూర్ పట్టణానికి చెందినది. ఇవి కాకుండా రామాయంపేట, తూప్రాన్, మెదక్, నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రుల్లో సైతం ఆరోగ్య శ్రీ ద్వారా సేవలు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు లేని కారణంగా పెద్ద రోగం వచ్చిందంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకునేందుకు రోగులు ముందుకువస్తున్నారు. అయితే నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసేందుకు వైద్యులు నిరాకరిస్తున్నారు.

రూ.1.20 కోట్ల పెండింగ్

జిల్లాలోని 3 ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా 10 నెలలుగా జనరల్ సర్జరీలు, ఆర్థోపెడిక్, కిడ్నీ సంబంధిత వ్యాధులు, గుండె, తదితర సర్జరీలు మొత్తం 356 చేశారు. ఇందుకు గానూ ఈ మూడు ఆస్పత్రులకు ప్రభుత్వం సుమారు రూ.1.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం వీటిని సకాలంలో చెల్లించపోవడంతో సదరు ఆస్పత్రుల వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు శస్త్ర చికిత్స చేసేందుకు ముందుకురావడం లేదు. ప్రశ్నిస్తే నెలల తరబడి బిల్లులు రాకుంటే ఆస్పత్రి నిర్వహణ ఎలా నడుస్తుందని సమాధానం ఇస్తున్నారు. అయితే రాజకీయ నాయకులు సిఫారసు చేస్తే మాత్రం చికిత్స చేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో పేషెంట్‌కు రూ.5 లక్షల వరకు చికిత్స అందించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని రూ.10 లక్షలకు పెంచింది. అయితే ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ

- నగదు, బంగారం అపహరణ


నగదు తీస్తున్న దొంగలు

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లి ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. చిరాగ్‌పల్లి పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి గ్రామ శివారులోని పురాతనమైన ఎల్లమ్మ గుడిలో గురువారం రాత్రి ము గ్గురు దొంగలు చొరబడ్డారు. హుండీలను పగులగొట్టి నగదు, బంగారం, వెండిని ఎత్తుకెళ్లారు. ఆరు నెలల నుంచి హుండీ లెక్కించలేదని, సుమారు రూ. 2 లక్షల నగదు, తులం బంగారం, వెండి ఉండొచ్చని ఆలయ కమిటీ సభ్యులు మోహన్‌రెడ్డి, రాంరెడ్డి తెలిపారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఆరు నెలల్లో ఎల్లమ్మ గుడిలో చోరీ జరగడం ఇది రెండోసారి.

గంజాయి విక్రేతల అరెస్ట్

- 1,500 గ్రాములు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

హుస్నాబాద్: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు చేశారు పోలీస్‌లు. హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు నిందితులు హుస్నాబాద్ పట్టణంలోని సబ్ స్టేషన్ సమీపంలో గంజాయి అమ్ముతున్నారని సమాచారం అందింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది, హుస్నాబాద్ పోలీస్‌లు కలిసి దాడులు చేశారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన చుక్క అనీల్, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన గుగులోతు సంతోష్ వద్ద 1500 గ్రాముల గంజాయి గుర్తించాం. వెంటనే గంజాయితోపాటు టీవీఎస్ ఎక్సెల్, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. తదుపరి నిందితులను విచారించగా వీర్లగడ్డ తండాకు చెందిన బూక్య రమేశ్ వద్ద కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో, హోటళ్లలో, కల్లు డిపోల వద్ద ఇతర ప్రదేశాల్లో ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు మృతి

పటాన్‌చెరు టౌన్ : చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఐనోల్ గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(41)తోపాటు డప్పు మహేశ్(36) ఇద్దరు పిల్లలన్ని తీసుకొని శుక్రవారం సాయంత్రం గ్రామంలోని తేటకుంట చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. ఇద్దరు పిల్లలు ఒడ్డున ఉండగా శ్రీనివాస్, మహేశ్ ఇరువురు చేపలు పట్టేందుకు కుంటలోకి దిగి ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో పిల్లలు ఇద్దరు ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, స్థానికులకు చెప్పారు. వెంటనే స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని నీటిలో మునిగిన శ్రీనివాస్, మహేశ్ మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- బంగారం, నగదు అపహరణ
- లబోదిబోమంటున్న బాధితులు
- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న జనం


మిరుదొడ్డి మండలం అల్వాలలో చోరీ ఘటనపై విచారణ జరుపుతున్న పోలీసులు (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్నారా? పెళ్లి, దావతులకు, సెలవుల్లో తీర్థయాత్రలు, సమ్మర్ టూర్లకు ప్లాన్ చేసుకున్నారా? ఇంట్లో విలువైన వస్తువులు, నగదు పెట్టి వెళ్తున్నారా? కారణమేదైనా ఇంటికి తాళం వేసి వెళ్తున్నప్పుడు, పక్కింటి వాళ్లను ఇంటి మీద ఓ కన్నేసి ఉంచమని చెప్పండి. లేదా పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లండి. లేదంటే మీ ఇళ్ల దొంగలకు టార్గెట్ కావచ్చు. అందినకాడికి దోచుకెళ్లే అవకాశం ఉండొచ్చు.. ఇటీవల జిల్లాలో జరిగిన చోరీలే ఇందుకు ఉదాహరణ..

తాళాలు వేసి ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లాలో పల్లె, పట్టణం తేడా లేకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్తే చాలు దుండగులు దోచుకుంటున్నారు. దీంతో బయటకు వెళ్లాలంటే జంకాల్సిన దుస్థితి. ఇళ్లకు తాళం వేసి, ఊరెళ్లే వాళ్లు పోలీసుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవటం దొంగలకు మరింత కలిసివస్తోంది. దీంతో ఇళ్లకు తాళాలు వేయడమే ఆలస్యం దొంగలు బీరువాలు తెరిచి బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకుపోతున్నారు.

సీసీ కెమెరాలున్నా..

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం నిరంతర నిఘా సాధనం. జిల్లా వ్యాప్తంగా 6,500 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఎన్నో నేర పరిశోధనల్లో ఇవి కీలకమయ్యాయి. ఏదైనా ఘటన జరిగితే సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించాలన్నంతగా ప్రాధాన్యత పొందాయి. పోలీసు పెట్రోలింగ్ కొనసాగుతున్నా, గ్రామాల్లో సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికి చోరీల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

చోరులకు కళ్లెం వేసే దిశగా..

చోరీలతో ప్రజలను బెంబేలెత్తిస్తూ సవాల్‌గా మారిన దొంగల ఆగడాలను పోలీసు యంత్రాంగం సీరియస్‌గా పరిగణిస్తుంది. రాత్రివేళ గ్రామాల్లో పోలీసుల పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేశారు. గ్రామ యువకులతో గస్తీ బృందాలు ఏర్పాటు, వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడూ సమాచారం షేరింగ్ అయ్యేలా యువతను అలర్ట్ చేస్తున్నారు. సీసీ కెమెరాలకు అవసరమైన మరమ్మతు, కొత్తవి ఏర్పాటు చేసి నిఘా మరింత పెరిగేలా చర్యలు చేపడుతున్నారు.

ఇటీవల జిల్లాలో చోరీలు..

- మార్చి 18న రాత్రి తొగుట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. 13 తులాల బంగారు, 10 తులాల వెండి నగలు, రూ.40,000 నగదు తస్కరించారు.
- మార్చి 26న రాత్రి దుబ్బాక పట్టణంలో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి అరతులం బంగారం, 20 తులాల వెండి నగలు, రూ.38,000 నగదు అపహరించారు.
- మార్చి 26న రాత్రి వర్గల్ మండలం గోవిందాపూర్‌లో ఐదు ఇళ్ల తాళాలు ధ్వంసం చేశారు. 3 తులాల బంగారు, 118 తులాల వెండి నగలు, నగదు ఎత్తుకెళ్లారు.
- మార్చి 29న రాత్రి మిరుదొడ్డి మండలం అల్వాలలో తాళం వేసిన నాలుగు ఇళ్లలో బంగారం, వెండి నగలతోపాటు రూ.10,000 దోచేశారు.
- మార్చి 31న రాత్రి సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలలో రెండు ఇళ్లలో దొంగలు తాళాలు పగులగొట్టి 15 తులాల బంగారం, 100 తులాల మేర వెండి ఆభరణాలు, రూ.40,000 నగదు ఎత్తుకెళ్లారు.
- ఏప్రిల్ 1న రాత్రి చేగుంటలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి నగలు, నగదు దొంగిలించారు.
- ఏప్రిల్ 3న రాత్రి వర్గల్ మండలం వేలూరులో తాళం వేసిన 8 ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. 27 తులాల బంగారు, 30 తులాల వెండి నగలు, రూ. 6 లక్షల నగదు అపహరించారు.
- ఏప్రిల్ 4న మిరుదొడ్డి మండలం చెప్యాలలో అక్కిరాజు సత్యనారాయణ ఇంటికి తాళం వేసి అంకిరెడ్డిపల్లి వెళ్లాడు. ఇంట్లో దొంగలు పడి అరతులం బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు.


తొగుటలో చోరీకి సంబంధించి ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

నిఘా వ్యవస్థ పటిష్టం



వేసవిలో చోరీల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. రాత్రి వేళ గస్తీ కొనసాగేలా యంత్రాంగాన్ని ఆదేశించాం. నిఘా వ్యవస్థను పటిష్టం చేశాం. ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. బంగారు, వెండి తదితర విలువైన వస్తువులు, నగదు ఇళ్లలో పెట్టి వెళ్లొద్దు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే డయల్ 100, లేదా సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూం 87126 67100కు సమాచారం అందించాలి.
– అనురాధ, సిద్దిపేట సీపీ

అన్ని చర్యలు చేపట్టాం



చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళ గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. సీసీ కెమెరాలకు అవసరమైన మరమ్మతులు చేపడుతున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విలువైన నగలు, నగదు ఇంట్లో పెట్టుకోవద్దు. తాళం వేసి ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే ఇరుగు పొరుగువారికి సమాచారమివ్వాలి. పోలీసులకు తెలియజేయాలి.
– శివకుమార్, ఎస్‌ఐ, గౌరారం

బావిలో పడి విద్యార్థి మృతి

- రోడ్డు పక్కన సేఫ్టీ గోడపై నిద్రించడంతో ప్రమాదం
- సిద్దిపేట పట్టణం ఇమాంబాద్ శివారులో ఘటన


కృష్ణ కౌశిక్ (ఫైల్)

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మర్రిమల్లి గ్రామానికి చెందిన రాచర్ల సాయి కృష్ణ కౌశిక్ (22) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పరీక్షల ప్రిపరేషన్ నిమిత్తం గురువారం రాత్రి సాయి కృష్ణ కౌశిక్ బైక్‌పై స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో కౌశిక్‌కు నిద్రరావడంతో సిద్దిపేట పట్టణ శివారు ఇమాంబాద్ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న సేఫ్టీ గోడపై నిద్ర పోయాడు. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడి మృతి చెందాడు. శుక్రవారం స్థానికులు రోడ్డు పక్కన ఉన్న బైక్, బ్యాగును గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బావిలో పడి ఉన్న కౌశిక్ మృతదేహాన్ని గుర్తించి క్రేన్ సాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి తండ్రి రాచర్ల మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి

- బట్టలు ఆరేసేందుకు ఇంటిపై మెట్లు ఎక్కుతుండగా ఘటన
- ఇటీవలె ఇంటర్ పరీక్షలు రాసిన బాలిక


చందన(ఫైల్)

కోహీర్(జహీరాబాద్): విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సజ్జాపురం గ్రామానికి చెందిన బేగరి అశోక్ కూతురు చందన(16) తూప్రాన్ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతుంది. ఇటీవల మొదటి సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికొచ్చింది. శుక్రవారం ఉదయం ఉతికిన బట్టలను ఇంటిపైన ఆరవేయడానికి మెట్లు ఎక్కుతుంది. ఈ క్రమంలో ఇంటికి విద్యుత్ సరఫరా కోసం అమర్చిన సర్వీసు వైరు బయటికి తేలి ఇనుప చువ్వకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. విషయం తెలియని చందన మెట్లు ఎక్కుతూ ఇనుపచువ్వను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే కుటుంబ సభ్యులు కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విద్యార్థిని తండ్రి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రిష్ణయ్య తెలిపారు.

కొత్త ఇంట్లో కరెంట్ సరి చేస్తుండగా..

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో చోటు చేసుకుంది. శుక్రవారం మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన ఎద్దు నర్సింహులు (52) ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు.నిర్మాణం ఎదుట లైటు ఏర్పాటు చేయడానికి ప్లగ్‌లో కరెంటు తీగలు పెడుతున్నాడు. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టి నర్సింహులు వెనక్కి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్) : ఇంట్లో నుంచి అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి శుక్రవారం కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన చీమల ఎల్లం (42) ఈ నెల 9న ఉగాది పండుగ రోజు అదృశ్యమయ్యాడు. అదే రోజున శివ్వంపేట మండల దంతన్‌పల్లి గ్రామ శివారులోని నిర్మానుష ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. శుక్రవారం పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. చీమల ఎల్లంకు ఇద్దరు భార్యలు ఉండడంతో రెండో భార్య అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంది. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 10 గుంటల భూమి అమ్మకం చేపట్టాడు. కుటుంబ పోషణ, ఆస్పత్రి ఖర్చుల కోసం అప్పులు ఎక్కువ కావడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. మృతుడి మొదటి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు

బెజ్జంకి(సిద్దిపేట): కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కల్లెపెల్లి శివారులో గల ఇట్టిరెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇట్టిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కాంతవ్వ ట్టిరెడ్డి కాంతవ్వ(85) కొడుకు, కోడలుతో కలిసి ఉంటుంది. రోజులానే గురువారం కొడుకు, కోడలు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కాంతవ్వ క్రిమిసంహారక మందు తాగింది. ఇంటికొచ్చిన తర్వాత గమనించిన కుమారుడు బాల్‌రెడ్డి వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న కాంతవ్వ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలి కుమారుడు బాల్‌రెడ్డి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి


లక్ష్మీనారాయణ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ మోహినొద్దీన్ కథనం మేరకు.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన మియాపురం లక్ష్మీనారాయణ(58) గురువారం రాత్రి బైక్‌పై పని నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో దౌలతాబాద్ మండలం బాలాజీ నగర్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ మదూరి రమేష్(50) పని ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ పని అనంతరం జాతీయ రహదారిపై కట్టమైసమ్మ వద్ద రాంగ్‌రూట్‌లో వస్తూ రమేశ్ బైక్‌ను ఢీకొట్టాడు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రైలు కింద పడి..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

రామాయంపేట(మెదక్): రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన కుల్ల యాదగిరి (45) సికింద్రాబాద్ వైపు వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్‌కింద పడి యాదగిరి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి జేబులో దొరికిన ఆధార్‌కార్డు, ఫోన్ ఆధారంగా ఆచూకీ తెలిసిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాటి, ఈత వనాల దగ్ధం

- సరిహద్దు రైతులే నిప్పంటించారు
- గీత కార్మికుల నిరసన


పట్టణ శివారులో దగ్ధమైన తాటి, ఈత వనాలు

హుస్నాబాద్: పట్టణ శివారులో పొట్లపల్లి రోడ్డు వైపు ఉన్న తాటి, ఈత వనాలు దగ్ధమ్యాయి. ఈ వనాలను సరిహద్దు రైతులే నిప్పుపెట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు డిమాండ్ చేశారు. దగ్ధమైన వనాలను శుక్రవారం గీత కార్మిక సంఘం నాయకులు, బీఎస్పీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణ శివారులో గీత కార్మిక సంఘానికి చెందిప 10 ఎకరాల సొంత భూమిలో దాదాపు 20 ఏళ్ల 1000 చెట్లతో గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. సరిహద్దు ఉన్న రైతులు నిప్పంటించడంతో గీత కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ ఘటన పై స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గీత కార్మికులకు వారి సొంత భూమికి ఫిన్సింగ్ చేసుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కోయ్యడ శ్రీనివాస్ గౌడ్, సమ్మయ్య గౌడ్, పెద్ద రవి, పూదరి శ్రీనివాస్, పూదరి రవీందర్ గౌడ్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): ఎలాంటి అనుమతి పత్రాలే లేకుండా కారులో రూ.1.10 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ముంద్రాయి వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా రాయపోల్‌కు చెందిన బయ్యారం ఆంజనేయులు కారులో నగదు లభించాయన్నారు.


వర్గల్(గజ్వేల్): నగదుతో ఎస్సై శివకుమార్

రూ. 76,640 సీజ్

వర్గల్(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్ ఎదుట రాజీవ్ రహదారిపై శుక్రవారం ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ వాహన డ్రైవర్ రాజంపేట మండలం లక్ష్మక్కపల్లికి చెందిన వాహన డ్రైవర్ గిర్రాజు కనకయ్య సరైన ఆధారాలు లేకుండా తన వాహనంలో రూ.76,640 తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నగదును సీజ్ చేసి సిద్దిపేట ఎలక్షన్ సెల్‌కు అందజేశామని ఎస్సై తెలిపారు.


నంగునూరు(సిద్దిపేట): నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఐ

రూ.83 వేలు స్వాధీనం

దుబ్బాకరూరల్: వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని హబ్సిపూర్ చౌరస్తా వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ బృందంతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటకు చెందిన జమల్పూర్ హరీశ్ ఓ వాహనంలో రూ.83వేలు నగదును తీసుకెళ్తున్నాడు. అతడి వద్ద ఎలాంటి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొని ఎఫ్‌ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జి అధికారి మోహన్‌కు అందజేశామన్నారు.

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ


కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- జహీరాబాద్‌లో శిక్షణ

జహీరాబాద్ టౌన్: ఆత్మరక్షణతోపాటు ఆరోగ్యం, దేహదారుఢ్యం, శారీరక దృఢత్వానికి కరాటే ఉపయోగపడుతుంది. కరాటే నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. శిక్షణకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు కూడా సిద్ధపడుతున్నారు. వేసవి కారణంగా శిక్షణ పొందడానికి కేంద్రానికి పిల్లలు వస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలోని తైక్వాండో కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మాస్టర్ శ్రీకాంత్ కొన్నేళ్లుగా పిల్లలకు వేసవిలో శిక్షణ ఇస్తున్నారు. సాధారణ రోజుల్లో కూడా శిక్షణ ఇస్తుండగా వేసవిలో మాత్రం పిల్లలు ఎక్కువ మంది వస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు టోర్నమెంట్‌లో పాల్గొని రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. వేసవితో పట్టణంలో ఆదర్శనగర్ కాలనీలో శిక్షణ శిబిరం ప్రారంభమైంది. 3 నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. జూనియర్లకు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు, సీనియర్స్‌కు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు కొనసాగుతుండగా ప్రస్తుతం 50 మందికి పైగా విద్యార్థులు వస్తున్నారు.

శారీరక దృఢత్వానికి ఉపమోగం



మాస్టర్ అంజి వద్ద కరాటేలో శిక్షణ తీసుకొని ఆయన ఆధ్వర్యంలో తైక్వాండో కరాటే అకాడమీని ఏర్పాటు చేశా. కొన్నేళ్ల నుంచి పట్టణంలో విద్యార్థులు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు వందల మంది విద్యార్థులు శిక్షణ పొందారు. జహీరాబాద్‌తోపాటు కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణంలో కూడా పిల్లలకు శిక్షణ ఇస్తున్నా. టోర్నమెంట్‌లు కూడా నిర్వహిస్తున్నాం. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షతో పాటు శారీరక దృఢత్వానికి ఉపయోగపడుతుంది.
– శ్రీకాంత్, కరాటే మాస్టర్, జహీరాబాద్

పలు అంశాల్లో...

కరాటే శిక్షణ కేంద్రంలో మాస్టర్ శ్రీకాంత్ పలు అంశాల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. పంచ్, మూవింగ్, టర్నింగ్ కటాస్, వెపన్ కటాస్, బ్లాక్, డౌన్ బ్లాక్, అప్పర్ బ్లాక్, ఫ్రంట్ కిక్, స్లాప్ కిక్‌లతో పాటు యోగా, ధ్యానం తదితర అంశాల్లో విద్యార్థులకు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా బ్యాచ్‌లుగా విభజించి ప్రాక్టీస్ చేయిస్తున్నారు.

విధులు నిర్వర్తించే ప్రదేశంలోనే..

- ఉద్యోగులు ఓటు వేసే అవకాశం
- పోలింగ్ కేంద్రం వద్ద వెసులుబాటు
- ఇతర చోట విధులు కేటాయిస్తే పోస్టల్ బ్యాలెట్



జహీరాబాద్: ఎన్నికల సంఘం పోలింగ్ తీరులో నానాటికీ ఆధునికతను ప్రవేశ పెడుతోంది. ఈ నిర్ణయం ద్వారా ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు పనిచేసే పోలింగ్ కేంద్రంలోనే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ)తో ఎన్నికల విధులు నిర్వర్తించే పోలింగ్ కేంద్రం నుంచే ఓటు వేసే అవకాశం రావడంతో పోస్టల్ బ్యాలెట్ తిప్పలు తప్పనున్నాయి.

అసెంబ్లీ మారినా..

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు విధులు నిర్వర్తించే నియోజకవర్గం, వారి స్వస్థలాన్ని పరిగణలోకి తీసుకొని పోలింగ్ డ్యూటీ కేటాయిస్తారు. దీంతో పోలింగ్ జాబితాలో పేరున్న చోట ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముండదు. తద్వారా విధులకు కేటాయించిన ఉద్యోగులంతా పోస్టర్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. కానీ లోక్ సభ ఎన్నికలకు వచ్చేసరికి ఏడు నియోజకవర్గాల పరిధిలో ఎక్కడ విధులు కేటాయించినా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోనే కావడంతో అభ్యర్థులు వారే ఉంటారు. తద్వారా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏ పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తించినా ఈవీఎంలోనే ఓటు వేసే అవకాశం ఇచ్చారు.

వీరికి మాత్రం పోస్టల్ బ్యాలెట్లు

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఇతర పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు కేటాయించే అవకాశం ఉంది. వీరికి మాత్రం గతంలో మాదిరిగానే పోస్టల్ బ్యాలెట్లు ఇస్తారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు ఎవరైనా వస్తే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసే బ్యాలెట్ బాక్సులో ఓటు వేయాలి. పోలింగ్‌కు విధులు కేటాయించిన పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు రెండో విడత శిక్షణ ఇచ్చే సమయానికి ఈవీఎంల ద్వారా ఎందరు ఓటు వేస్తారు, పోస్టల్ బ్యాలెట్ ఎందరు వినియోగించుకుంటారనే లెక్క తేలనుంది.